క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగనుందని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. తరాలపల్లి, రాంపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ రోడ్డు, హనుమకొండ చౌరస్తా, ఏనుగులగడ్డ, పింజర్ల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆంగ్ల విభాగం పరిశోధకులు జి.సురేష్‌కుమార్, ఎస్.స్వాతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎన్విరాన్‌మెంటల్ పర్‌స్పెక్టివ్ ఇన్ ది సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ మార్గరేట్ అట్వూడ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సురేష్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. అలాగే, సఫరింగ్ అండ్ ప్రొటెస్ట్ ఇన్ సెలెక్ట్ నావెల్స్ గీతాహరిహరన్ అండ్ అనితానాయర్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్వాతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపాజ్యోతి పర్యవేక్షణలో వారు తమ పీహెచ్‌డీ పూర్తిచేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో సురేష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. కేయూలో కాంట్రాక్టు సీనియర్ అసిస్టెంట్‌గా స్వాతి విధులు నిర్వర్తిస్తున్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు, డివిజన్ల అధ్యక్షుల నియామకం

హన్మకొండ: బీజేపీ హనుమకొండ జిల్లా కౌన్సిల్ సభ్యులు, నగరంలోని డివిజన్ల అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ప్రకటించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బొమ్మసాని అనిల్, వాసం కరుణ, కేతిపల్లి సంపత్ రెడ్డి, గుండ్ల శ్రీనివాస్, జంపాల పూర్ణచందర్, జన్ను మధు, పి.రాంరెడ్డిని నియమించినట్లు తెలిపారు. 8వ డివిజన్ అధ్యక్షుడిగా రాకేష్, 10వ డివిజన్ ఉడుతల మురళి, 30వ డివిజన్ నూకల ఉషాదేవి, 51 డివిజన్ డి.శివరెడ్డి, 53వ డివిజన్ పెరమాండ్ల రామకృష్ణ, 58వ డివిజన్ నద్దునూరి మోహన్‌దాస్, 59వ డివిజన్ అధ్యక్షుడిగా వైల జితేందర్‌ను నియమించినట్లు ఒక ప్రకటనలో వివరించారు.

మున్నూరు కాపు పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక



హన్మకొండ అర్బన్: హనుమకొండ పద్మాక్షి రోడ్డులోని శ్రీఆంజనేయ మున్నూరు కాపు పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు హనుమకొండలో పద్మాక్షి కాలనీలోని శ్రీప్రసన్నాంజనేయ దేవాలయంలో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 2025 – 2027వ సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కసుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా తోట ప్రకాష్, కోశాధికారిగా కర్ర దశరథ్ కుమార్, ఆడిటర్‌గా దేవులపల్లి సంపత్, కార్యవర్గ సభ్యులుగా నల్ల జనార్ధన్, కొండ్ర సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణాధికారిగా గందె కృష్ణ వ్యవహరించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం ప్రతీ సంవత్సరం దేవాలయానికి సంఘం నుంచి రూ.75 వేలు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

వెలమ సంక్షేమానికి కృషి



హన్మకొండ చౌరస్తా: వెలమ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఏఆర్ఆర్ గార్డెన్‌లో వెలమ సంక్షేమ సంఘం 30వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పేరాల మధుసూదన్ రావు, కాకులమర్రి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తామందరం ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంఘం బలోపేతం చేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా పలు కార్యక్రమాలు చేసుకుందామని అన్నారు. అనంతరం సంఘం కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ సంఘం వ్యవస్థాపక సభ్యులను స్మరించుకుంటూ సంఘం బలోపేతానికి పాటుపడుతున్న పెద్దలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుజ్జ ప్రభాకర్‌రావు, తక్కళ్లపెల్లి శ్యాంసుందర్‌రావు, జాయింట్ సెక్రటరీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, స్వామిరావు, బాలకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డెడ్‌లైన్.. సెప్టెంబర్ 30

- గడువులోగా పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి
- లేదంటే ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు ఇవ్వరు
- రవాణాశాఖ దాడుల్లో దొరికితే కేసులు నమోదు
- వరంగల్ జిల్లాలో 2019, మార్చి 31 వరకు ఉన్న వెహికిల్స్ 37,045





హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు (ఫైల్)

సాక్షి, వరంగల్: ఇక పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్ఎన్‌పీ) అమర్చుకోవాల్సిందే. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ చివరన ఉన్న లేజర్ కోడ్‌ను ట్రాక్ చేసి వాహనదారుడి పేరు, వివరాలు తెలుసుకోవచ్చు. వాహనం ధ్వంసమైన సందర్భంలో కూడా లేజర్ కోడ్ ద్వారా వెంటనే వివరాలు తెలుసుకునే వీలుంటుంది. ఇలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనదారులను సులువుగా గుర్తు పట్టేలా ఉన్న హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 30లోపు బిగించుకోవాలి. ఈ లెక్కన చూసుకుంటే 2019 మార్చి 31లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్న 37,045 అన్ని రకాల పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకోవాల్సిందేనని ఆర్టీఏ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే 2019 ఏప్రిల్ ఒకటి తర్వాత తయారైన వాహనాలకు ఇప్పటికే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ నిబంధన అమలవుతోంది. 2019 మార్చి 31 వరకు ఉన్న పాత వాహనాలన్నింటికి సాధారణ నంబర్ ప్లేట్లు మాత్రమే ఉన్నాయి. వాటిని తొలగించి ప్రస్తుతం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకోకపోతే ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్ ధ్రువపత్రం తదితర సేవలు నిలిపివేస్తారు. వాటిని అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందులు తప్పవు.

బిగించుకున్నాక ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి..

వాహనం నంబర్ ప్లేట్‌పై ఏమైన నంబర్లను ఇష్టమైన రీతిలో ముద్రించుకుంటామంటే ఇకపై కుదరదు. నూతన, పాత వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలి. జిల్లా రవాణాశాఖలో వివిధ సేవలకు వచ్చే పాత వాహనదారులకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ ఉంటేనే సేవలను అందిస్తామని రవాణాశాఖ స్పష్టం చేస్తోంది. ఇవి బిగించుకోవడానికి వాహన యజమానులు www. siam. in లో వాహన వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం వచ్చిన కొత్త నంబర్ ప్లేట్‌ను బిగించాక ఫొటో తీసి అదే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని నిబంధనలు విధించారు. అదే సమయంలో వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్ చార్జీలను ఖరారు చేశారు. కనిష్ఠంగా రూ.320 నుంచి గరిష్ఠంగా రూ.860గా నిర్ణయించింది.

లేకుంటే సేవలు బంద్..



హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించకుంటే వాహనం అమ్మాలన్నా.. రవాణాశాఖలో పేరు మార్చు చేయాలన్నా ఇక సాధ్యం కాదు. బీమా, పొల్యూషన్ ధ్రువ పత్రాలు జారీ చేయం. సెప్టెంబర్ 30 గడువు తీరాక రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో దొరికితే కేసులు నమోదు చేస్తాం. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి జీఓ వచ్చింది. అయితే, ఇంకా విధివిధానాలు రావాలి. అవి వచ్చాక దాని ప్రకారం అమలు చేస్తాం.

– శోభన్‌బాబు, జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ, వరంగల్

జర్నలిజంతో విస్తృత ఉపాధి అవకాశాలు

- దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ సురేష్‌లాల్


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌లాల్

కేయూ క్యాంపస్: జర్నలిజం కోర్సు పూర్తిచేసిన వారికి మీడియాలో విస్తృత ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయని కేయూ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ అన్నారు. దూరవిద్యా కేంద్రంలో 2022 – 2024లో జర్నలిజం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల విస్తృతి కారణంగా ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా క్షణాల్లో సమాజంలో అన్ని వర్గాలకు సమాచారం అందుతోందన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రజా సంబంధాల అధికారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ స్టాఫ్ ట్రెనింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, జర్నలిజం విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, అధ్యాపకులు నర్సింహరాములు, వెంకటేశ్వర్లు, సురేందర్, చిరంజీవి, శంకర్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి


నోటీస్ అందజేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: నగరంలో షాపింగ్ మాల్స్ గుమాస్తాలు, కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్‌లో వ్యాపారవేత్త కాసం షాపింగ్ మాల్స్ యజమాని ఓం నమశ్శివాయకు ఆదివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందున ఈనెల 20న జరగనున్న సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్మికులకు ప్రభుత్వాలు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ఎనిమిది గంటల పని దినాలు అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని, మహిళా కార్మికులకు కనీస వసతులు, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బావు రామస్వామి జి.జగదీశ్వర్, జి.రాజు, బాబురావు, కృష్ణమూర్తి, మెరుగు రాజశేఖర్, శ్రీరాములు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం.. కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకే నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షతన పోచమ్మమైదాన్‌లోని విస్‌డమ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగుల రంజిత్ తదితరులు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగుల దయాకర్, ఉపాధ్యక్షులుగా సీహెచ్.నర్సింగం, బరిగెల కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఎలకంటి రాజేందర్, సహాయ కార్యదర్శులుగా బండి కుమార్, బన్న నర్సింగం, కోశాధికారిగా గొర్రె ప్రదీప్‌తోపాటు 15 మంది జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అదనపు కలెక్టర్ శ్రీనుకు శుభాకాంక్షలు


మొక్క అందిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మేన శ్రీనును మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులు, ఎంపీడీఓల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, సంఘం నాయకులు కలిశారు. హనుమకొండ కలెక్టరేట్‌లో మేన శ్రీను ఎంపీడీఓలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేన శ్రీను మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకమని గుర్తుచేశారు. అందరూ కష్టపడి జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓల సంఘం ఉపాధ్యక్షుడు మొగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి నందం విజయకుమార్, ఎంపీడీఓలు రామడుగు లక్ష్మీప్రసన్న, కె.అనిల్ కుమార్, గుండె బాబు, గజ్జెల విమల, చిరబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మేమెంతో.. మాకంత కావాలి


హనుమకొండకు చేరుకున్న పాదయాత్ర

హన్మకొండ: రాష్ట్రంలోనే అధిక జనాభా ఉన్న కులం ముదిరాజ్ కులమని, తమకు రిజర్వేషన్ ఫలాలు, రాజ్యాధికారంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజ్ ముదిరాజ్ అన్నారు. మేడారంలో చేపట్టిన ముదిరాజ్‌ల ఆత్మగౌరవ యాత్ర మేడారం నుంచి ములుగు, నల్లబెల్లి, నర్సంపేట మీదుగా 15వ రోజు ఆదివారం వరంగల్, హనుమకొండకు చేరుకుంది. ఈమేరకు హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల ఆత్మగౌరవం కోసం పాదయాత్ర చేపటినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్నా రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తామెంతో.. తమకంత రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వకపోతే పార్టీలకు బుద్ధి చెబుతామన్నారు.

ఉత్తమ ఫలితాలు అభినందనీయం



న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాలు ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ రాణా సిద్దిఖీ అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన మైనార్టీ గురుకులాలు, ఇతర కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లను హనుమకొండలో మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నర్సంపేట (జీ1) శ్రీపాల, వరంగల్ (జీ1) దాసరి కృష్ణకుమారి, డోర్నకల్ (జీ1) రిజ్వానా బేగం, జనగామ (బీ1)కుమార్, సాహిన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వాన్, ఫోరం ప్రతినిధులు సయ్యద్ అక్బర్, రజామాలిక్, ఎం.ఖలీం, నాజ్‌నీన్, నయీం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



విద్యారణ్యపురి: వరంగల్‌కు చెందిన హనుమకొండ డీఈఓ కార్యాలయంలో 2018 నుంచి 2024 వరకు ఏసీజీఈగా పనిచేసి హైదరాబాద్‌లో ఎస్ఎస్‌సీ బోర్డులో సహాయ కమిషనర్‌గా, కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.చలపతిరావును పలువురు సన్మానించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యకమంలో హనుమకొండ ఏసీజీఈ భువనేశ్వరి, పలువురు హెచ్ఎంలు, సిబ్బంది సన్మానించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

హన్మకొండ: పహల్గాంలో పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు డిమాండ్ చేశారు. శివాజీ యువజన భక్త మండలి ఆధ్వర్యంలో మృతులకు నివాళి అర్పిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు కాగడాలు, కొవ్వొత్తులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం


లోగోను ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

హన్మకొండ: కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో కార్మిక మాసోత్సవం లోగో వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం మాసమంతా కార్మికవాడల్లో పర్యటిస్తానని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. లేబర్ కార్డులు, పెండింగ్ బిల్లుల విడుదలకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆటో కార్మికులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల కోసం పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాయిని రవి, ఇంజాల మల్లేశం, రవీందర్ రెడ్డి, ఇస్మాయిల్, రమేష్, బాబురావు, నరహరి, శివకుమార్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న వాకర్స్ ప్రతినిధులు


రాఘవేందర్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

ఖిలా వరంగల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్రమశక్తి అవార్డు అందుకున్న తూర్పుకోటకు చెందిన బిల్లా శ్రీకాంత్‌ను నగర వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్ ఆదివారం సన్మానించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి శ్రీకాంత్ కృషి చేస్తున్న తీరును పలువురు ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కార్మిక కుటుంబాలకు అండగా నిలుస్తూ చేయూతనివ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు భూమయ్య, ఎండీ.రబ్బానీ, ఆశీర్వాదం, పోలెపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేవులపల్లి రాఘవేందర్‌కు..

కాజీపేట రూరల్: ఇటీవల ప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్న తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్‌ను కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రైల్వే జేఏసీ నాయకులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, రైల్వే జేఏసీ నాయకులు వస్కుల రవీందర్, ఎస్.హరిబాబు, బి.రాజేష్, టి.నాగేందర్, కె.మధు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రశాంత్‌నగర్‌లో ఉచిత కరాటే శిక్షణ

కాజీపేట: వేసవి సెలవుల నేపథ్యంలో కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ పార్కులో కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్ (కరాటే)లో బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు సీనియర్ మాస్టర్ కె.కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు మరిన్ని వివరాలకు 94419 39262 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

హాస్యంతో ఆనందం, ఆరోగ్యం



విద్యారణ్యపురి: హాస్యమే ఆనందం, ఆరోగ్యం అని, నవ్వులతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని ప్రతాపరుద్ర కాలనీలో నవ్వుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండడానికి, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండడానికి రోజూ నడకతో పాటు నవ్వు కూడా ముఖ్యమేనని తెలిపారు. క్యాన్సర్ వంటి చికిత్సలో కూడా లాఫింగ్ థెరఫీని ఉపయోగిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పిలివెంట్ల అనంత్, బాధ్యులు సురేందర్, వేణు, రాపర్తి లక్ష్మయ్య, జయప్రసాద్, సత్యనారాయణ, రాజమొగిలి, రవి, సుదర్శన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రిటైర్డ్ ఉద్యోగి మృతి

వరంగల్ చౌరస్తా: పైడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గత ఫిబ్రవరిలో పదవీ విరమణ పొందిన బాలగోని లక్ష్మణ్ కుమార్.. అప్పుల బాధ, అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అనారోగ్య సమస్యలు, అప్పుల బాధతో సతమతమవుతున్న క్రమంలో మార్చి 16న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై, ఎన్ని ఆస్పత్రులు తిరిగినా హెల్త్ కార్డు పనిచేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం కుటుంబ సభ్యులు రూ.10 లక్షల అప్పు చేసి చికిత్స అందించారు. అయినప్పటికీ మానసిక వైకల్యంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురై బ్రెయిన్‌స్ట్రోక్‌తో మరణించినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, సభ్యులు కోరారు.

‘మెడికవర్’లో మెగా సీఎంఈ ప్రోగ్రాం



కాజీపేట అర్బన్: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హంటర్ రోడ్డులోని కోడం కన్వెన్షన్ హాల్‌లో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (మెగా సీఎంఈ) ప్రోగ్రాంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో తాజా అభివృద్ధి, ఆధునిక సాంకేతికతలపై తమ అనుభవాలను మెడికవర్ వైద్యులు వివరించారు. అక్యూట్ స్ట్రోక్ ప్రొటోకాల్స్, పల్మనాలజీలో క్రయోథెరపీ, రోబోటిక్ హృదయ శస్త్ర చికిత్స, సెప్సిస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలను తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు షఫీ, శ్రావణ్, సునీల్, ప్రదీప్ విట్ట, పూర్ణచంద్, లక్ష్మీదీపక్ నాగూర్, నాగార్జున రెడ్డి, ప్రియాంక పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాజీపేట రూరల్: రాష్ట్రంలో కులగణన కార్యక్రమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 45 రోజుల్లో చేపట్టి పూర్తి చేయడాన్ని హర్షిస్తూ కాజీపేట బాపూజీనగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. తెలంగాణలో మాదిరిగా దేశమంతటా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేయడంపై సంబురాలు జరుపుకున్నారు.

నవోదయలో నీట్ పరీక్ష ప్రశాంతం

మామునూరు: మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. వైద్యవిద్యలో ప్రవేశాలు పొందేందుకు దేశవ్యాప్తంగా జరిగిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగింది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మడికొండ: మడికొండ ప్రభుత్వ పాఠశాలలో 1999 – 2000వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పానగోటి వెంకట్‌రావు, కోన మారుతి, నర్ర శ్రీనివాస్, పేర్ల సురేష్, బన్న శ్రీనివాస్, కొమురవెల్లి నరేష్, లక్ష్మణ్‌రాజ్, దీపిక, లక్ష్మి, వెరోనిక, సుజాత, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట

వరంగల్: భూభారతి చట్టం–2025 అమలులో భాగంగా వర్ధన్నపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈనెల 5 నుంచి 14 వరకు మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సదస్సుల నిర్వహణ కోసం రెండు బృందాలు ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ భూముల తోపాటు గ్రామస్థాయిలో ఉండే భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.